క్లుప్తంగా

ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ నాగమణి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు ఒక రోజు శిక్షణ గురువారం ఇచ్చారు. కోర్సు డైరక్టర్లు మండల విద్యాధికారులైన నాగమణి, వెంకటరమేష్, రీసోర్స్ పర్సన్ నాగమణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణకు రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని పాఠశాల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు ఈ నెల 3 నుంచి 7 వరకు పాఠశాల స్థాయిలో కమిటీ బాధ్యతలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు: ఆసుపత్రికొచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వైద్యులకు సూచించారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో ఆసుపత్రి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. అడ్వైజరీ కమిటీ చైర్మన్ హోదాలో పాల్గొన్న ఎమ్మెల్యే సిబ్బందినుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆసుపత్రి అడ్వైజరీ కమిటీ సభ్యులుగా షేక్‌హుసేన్, నాగరాజు లలితలను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ నిరీషా, మాజీ ఉప సర్పంచు ఆనంద్, మాజీ సర్పంచు గరికపాటి బసవరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించండి

కూడేరు: ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులను సమన్వయం చేసుకొని ప్రణాళికలు తయారు చేసుకొని పాఠశాలల అభివృద్ధి పథంలో నడిపించాలని రీసోర్స్ పర్సన్లు ఆనంద్ నాయక్, రమణ ప్రసాద్, రాఘవేంద్ర సూచించారు. గురువారం కూడేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠశాలల అభివృద్ధిపై మండల స్థాయిలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాధికారులు-1,2లు మహమ్మద్ గౌస్, సాయికృష్ణలు తనిఖీ చేశారు.


సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సర్పంచు మోనాలిసా

వజ్రకరూరు: వజ్రకరూరు మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచు మోనాలిసా తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ గ్రామ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిమ్మప్ప, ఏపీఓ లక్ష్మికాంత బాయి, హెచ్ఈ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి మల్లయ్య, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల పోస్టర్ల విడుదల



పెద్దచౌడేశ్వరి పంచమ జ్యోతుల ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలోని నాల్గో వార్డులో ప్రసిద్ధిగాంచిన పెద్ద చౌడేశ్వరీ అమ్మవారి పంచమ జ్యోతుల ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను గురువారం తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యుల చేతులమీదుగా ఆవిష్కరించారు. తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు మాట్లాడుతూ జ్యోతుల ఉత్సవాలు ఈనెల 14 నుంచి 15 వరకు జరుగుతాయన్నారు.

ప్రజలను మభ్యపెట్టడంలో చంద్రబాబు దిట్ట

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

కూడేరు: మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. గురువారం ఆయన కూడేరులోని విఘ్నేశ్వర కాలనీలో మండల సీపీఐ, అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులతో కలిసి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకొస్తే పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం కేటాయించి పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత విస్మరించారన్నారు. కార్యక్రమంలో వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నారాయణమ్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, నేతలు శ్రీరాములు, మలరాయుడు, నాగేంద్ర, ధనరాజ్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్ట్ జోరు





ఉరవకొండ నియోజకవర్గంలోని ఓ బెల్టుషాపు వద్ద బార్‌ను తలపిస్తున్న సిట్టింగ్ రూం

- బెల్టుషాపుల వద్దే మందు బాబులకు సిట్టింగ్ రూంలు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

ఉరవకొండ: కూటమి సర్కారు ఏర్పాటయ్యాక మద్యం ఏరులై పారుతోంది. లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే కాకుండా విచ్చలవిడిగా బెల్టుషాపుల్లో మద్యం లభిస్తోంది. దీంతో మందుబాబులు నిత్యం మత్తులో జోగుతున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో మద్యం అమ్మకాలు లేకపోవడంతో ప్రశాంత వాతావరణం కనిపించేది. గొడవలు, ఘర్షణలు లాంటివి ఘటనలు ఏమీలేకపోయేవి. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడానికి వీల్లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించినా, నాయకులు ఖాతరు చేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మద్యంకు గేట్లు ఎత్తేయడంతో గ్రామాల్లో తాగినోళ్లకు తాగినంత అన్నట్లు మద్యం అందిస్తున్నారు. ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ముచేసుకుంటున్నారు. గ్రామాల్లోనే బెల్టుషాపుల వద్ద మందుబాబులకు సిట్టింగ్ రూంలు ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఉరవకొండ నియోజకవర్గంలో మద్యం దుకాణాలు ఇలా..	
మండలం	షాపులు
ఉరవకొండ	5
విడపనకల్లు	2
వజ్రకరూరు	2
కూడేరు	3
బెళుగుప్ప	1

ఉరవకొండ నియోజకరవ్గంలో 13 మద్యం షాపులు మంజూరుకాగా, వీటి పరిధిలో 200కు పైగా అనధికారిక బెల్టుషాపులు ఉండటం విశేషం. కర్ణాటక సరిహద్దులో ఉన్న విడపనకల్లులోనే అత్యధికంగా 80కు పైగా బెల్టుషాపులు నడుస్తుండం విశేషం. ఉరవకొండ మండలంలోని కొన్ని బెల్టుషాపులను టీడీపీ నేతలు ఏకంగా పూజలు నిర్వహించి సంప్రదాయబద్దంగా ప్రారంభించారు. బెల్టుషాపుల్లో అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడమే కాకుండా కొన్ని బెల్టుషాపుల వద్ద పక్కనే సిట్టింగ్ రూంలు కూడా ఏర్పాటు చేసి మరీ వారికి స్నాక్స్ ఐటంలు, వాటర్ ప్యాకెట్, నీళ్ల కూడా అందుబాటులో ఉంచారు. బెల్టుషాపుల్లో క్వాటర్‌పై రూ.30 నుంచి రూ.50 పెట్టి విక్రయిస్తున్నారు. గ్రామాల్లోనే మద్యం కావాల్సినోళ్లకు కడుపునిండా మద్యం అందిస్తున్నారు. ప్రతి మద్యం షాపు పరిధిలో గ్రామాల్లో మూడు నుంచి నాలుగు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడానికి వీల్లేదు. బెల్టుషాపులు పెడితే బెల్టు తీస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక జారీచేసినా కూటమి నాయకులు బేఖాతారు చేస్తున్నారు. టెండర్లలలో మద్యం షాపులు దక్కించుకున్న వారు ఒక్కో బెల్టుషాపుకు రూ.లక్ష నుంచి రూ.50 వేలు తీసుకొని మద్యం సరఫరా చేస్తుడంటంతో గ్రామాల్లో అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్, సివిల్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదు.

మహిళలకు ఇబ్బందులు



మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో మహిళలు వీధుల్లోకి రాలేని పరిస్థితి నెలకొంది. బెల్టుషాపులు ఇళ్ల మధ్యలోనే ఉండడంతో మందుబాబులు మద్యం సీసాలు ఇళ్ల ముందు విసిరిపడేస్తున్నారు. పోలీసులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు.

– బోయ సుశీలమ్మ, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్, వజ్రకరూరు



ఉరవకొండలోని బెల్టుషాపులో అమ్మకాని సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లు

మద్యాన్ని నియంత్రించాలి



రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలి. విచ్చలవిడిగా వెలసిన బెల్టుషాపులను ఎత్తి వేసి గ్రామాల్లో మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. మద్యం మత్తులో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మద్యం మత్తులో కొందరు మహిళలు, అమ్మాయిలుపై అఘాత్యాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే వామపక్ష పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతాం.

– పార్వతీ ప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య, జిల్లా అధ్యక్షురాలు, కూడేరు

స్థానికంగానే పరీక్ష సెంటర్ ఏర్పాటు చేయండి

బెళుగుప్ప : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులతో పాటు కేజీబీవీ విద్యార్థినులకు కలిపి ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని రీజనల్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ వెంకటరమణనాయక్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. గురువారం మండల, జిల్లాలోని ఏఐఎస్ఎఫ్ నాయకులు కలసి జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాదాజ్యోతి, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శి తగ్గుపర్తి చందు, రాష్ట్ర సమితి సభ్యులు లలిత, చిట్మా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా ఇవ్వలేదని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్డు దారులు

ఉరవకొండ: ఆరు నెలలుగా రేషన్ సక్రమంగా అందించలేదని కార్డుదారులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పట్టణంలోని 10వార్డు 4బ్లాక్ కు చెందిన మహిళలు మాట్లాడుతూ కూలీ, నాలీ చేసుకొనే బతికే తామురేషన్ బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. తమకు గత ఆరు నెలలుగా బియ్యం వేయకుండా డీలర్లు వేధిస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు.

చోరీలు అరికట్టేందుకు చర్యలు

కూడేరు: జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఏటీఎం సెంటర్లు, దుకాణాలు, గృహాలు, ఆలయాల్లో చోరీలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. దొంగలను గుర్తించేందుకు పోలీసు స్టేషన్ దగ్గర రహదారి పక్కన, బస్టాండులో ప్రధాన కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

స్వలాభం కోసమే ఎంపీపీ పార్టీ మార్పు

బెళుగుప్ప: కేవలం స్వలాభం కోసమే ఎంపీపీ పెద్దన్న టీడీపీ తీర్థం పుచ్చుకున్నాడని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల జేసీఎస్ కన్వీనర్ ఇంట పార్టీ మండల ఎంపీటీసీలు, నాయకులతో కలసి కన్వీనర్ విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ టీడీపీ తీర్థం పుచ్చుకుని వైఎస్సార్‌సీపీని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని విమర్శించడాన్ని వారు ఖండించారు. ఎంపీపీకి రాజకీయభిక్ష పెట్టింది వైఎస్సార్‌సీపీ అని, ఎంపీపీ పదవి ఇచ్చింది మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీలో ఉండి పదవులు అనుభవించి 'తల్లిపాలు తాగి రొమ్ము గుద్దేరకం' ఎంపీపీది అని అన్నారు. దుద్దేకుంటలో ఒక సారి సర్పంచ్‌గా అనామకుడిపై పోటీ చేసినా కేవలం 60 ఓట్లు మెజార్టీ, వైఎస్సార్‌సీపీలో ఎంపీటీసీగా 60 ఓట్లు మెజార్టీ అది కూడా టీడీపీ ప్రాదేశిక ఎన్నికల బహిష్కరణ సమయంలో వచ్చాయంటే నీ విలువ ఏంటో తెలుస్తోందన్నారు. ఏఒక్క ఎంపీటీసీ, సర్పంచ్ కాదుకదా ఒక్క కార్యకర్త కూడా నీ వెంట రారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రామసాగరం ఎంపీటీసీ వీరబొమ్మన్న, మాజీ సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాసులు, పార్టీ మండల నాయకులు వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, పాతన్న, తిమ్మారెడ్డి, బాబురెడ్డి, అంగడి ఎర్రిస్వామి, ధనుంజయ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

బొమ్మనహాళ్: 2025 నూతన సంవత్సరం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, లలితమ్మ, యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరావు, సహ అధ్యక్షురాలు వాణిశ్రీ, మండల జిల్లా కౌన్సిలర్ రామలింగాదేవి, నాగరాజు, నగేష్, మధుసూదన్, పెద్దన్న, నాగేంద్ర, బషీర్, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: నూతన సంవత్సరం-2025 యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను కూడేరు ఎమ్మార్సీలో మండల విద్యాధికారులు 1,2 మహమ్మద్ గౌస్ , సాయి కృష్ణలు గురువారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సిద్దన్న, జనరల్ కార్యదర్శి చంద్రమోహన్ , కరుట్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు సన్నప్ప, నారాయణ, చంద్రశేఖర్, అరుణ, పద్మావతి, దస్తగిరి పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కుందుర్పి: స్థానిక ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల వారు వేర్వేరుగా నూతన క్యాలెండర్లు, డైరీలు, జీఓల పుస్తకాలను గురువారం ఆవిష్కరించారు. ఎంఈఓ ఓబుళపతి,ఏపీటీఎఫ్ నాయకులు బొమ్మయ్య, బీసీ తిమ్మప్ప,సంగప్ప, ఈరప్ప, ఎస్టీయూ నాయకులు కృష్ణమూర్తి, రాధాకృష్ణంరాజు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, హెచ్‌ఎం బాలాజీ, రాజశేఖర్‌లతో కలసి ఏపీటీఎఫ్-1938 ఉపాధ్యాయ సంఘం సభ్యులు డైరీలు, క్యాలెండర్‌లను గురువారం ఆవిష్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు పి.సి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వజీర్‌బాష, మండల అధ్యక్షులు చెన్నబసయ్య, ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

బెళుగుప్ప: యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మండల గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎంఆర్‌సీ వద్ద ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అర్జున్, మండల అధ్యక్షులు ఓబుళపతి,నాయకులు రఫీ, మారుతి, శంకర్‌రెడ్డి, వెంకటరాముడు, నాగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు



బొమ్మనహాళ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు మల్లికార్జున, వీరన్నలు



కణేకల్లులో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈఓలు లక్ష్మణ, భవానీ శంకర్‌లు



కూడేరు: విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మహమ్మద్ గౌస్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండలంలోని 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలసి సైన్స్ ప్రాజెక్టులతో అబ్బురపరిచారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ పరిశీలించారు. బెళుగుప్ప జడ్పీహెచ్‌ఎస్ నుంచి రాకెట్ లాంచర్, కోనంపల్లి ఎంపీయూపీ నుంచి ఆండ్రాయిడ్ మొబైల్ కంట్రోలర్, నరసాపురం జడ్పీహెచ్‌ఎస్ నుంచి హ్యూమనాయిడ్ రోబోట్ ప్రాజెక్టులు ఎంకయ్యాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ , ఉమాశంకర్, రామ్మూర్తి, సుధామాధవి, మారుతీ ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం మండల స్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదన్శనలో పలు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న తెలిపారు. గురువారం ఉదయం నుంచి మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. లింగదహాళ్, శ్రీధరఘట్ట, బొమ్మనహాళ్ కేజీబీవీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎంఈఓలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోధ్యాయుడు రాజ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, అధ్యాపకులు సుబ్బరాయుడు, ఎంఆర్‌సీ మంజప్ప పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కూడేరు: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి మహమ్మద్ గౌస్ పిలుపు నిచ్చారు. గురువారం కూడేరులోని హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్మూరు, కూడేరు, మరుట్ల, కరుట్లపల్లి, జల్లిపల్లి,కొర్రకోడు హైస్కూళ్ల, కేజీబీవీ, ఉదిరిపికొండ, గొటుకూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లు జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. గురువారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మండలస్థాయి సైన్స్‌ఫైర్ పోటీలు జరిగాయి. జలాశయంలో సర్‌ప్లస్ అయ్యే వాటర్ ద్వారా కరెంటు ఉత్పత్తి చేయు విధానాన్ని రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు వినోద్‌కుమార్ నాయక్, హర్షవర్ధన్ ప్రదర్శించారు. ఎంఈఓలు లక్ష్మణ, భవానీ శంకర్‌లు, జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ఫజులున్నీషా, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం మల్లిఖార్జున, దాదావుద్, సీఆర్పీ రాజేష్, లక్ష్మీకాంత్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

ఆకట్టుకున్న మండల స్థాయి సైన్స్‌ఫేర్

వజ్రకరూరు: స్థానిక కేవీజెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్సుఫేర్ అందరినీ ఆకట్టుకుంది. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్, ఆదర్శపాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 23రకాల ప్రాజెక్టులను తయారు చేవారు. మండలస్థాయి సైన్సుఫేర్‌ను సర్పంచు మోనాలిసా, ఎంఈఓ తిమ్మప్ప, హెచ్‌ఎం స్వర్ణలత, వేణు గోపాల్ తదితరులు సందర్శించారు.

కార్యాలయం ప్రారంభం

రాయదుర్గంటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి బాషా, కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పరమేష్, సంయుక్త కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు ఏకాంత్, జనార్ధనరెడ్డి, మంజునాథ, అవిష్, పీరాసాబ్, వెంకటేశులు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

శెట్టూరు: బీజేపీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు బంగారు మల్లారెడ్డి గురువారం తెలిపారు. మండల కేంద్రంలో నాయకులు మండల అధ్యక్షుడిగా చింతర్లపల్లి నాగరాజు యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవారాజు, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ నగేష్, సీనియర్ నాయ కులు నంజుండరావు పాల్గొన్నారు.

ఆగని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిసరాలల్లో, జనావాసం లేని ప్రాంతాల్లోని ట్రాన్స్ ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి, కాపర్ ఎత్తుకెళ్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో కళ్యాణదుర్గం సమీపంలోని గూబనపల్లి గ్రామం దగ్గర ఉన్న వైఎస్ఆర్ కాలనీలో విద్యుత్ అధికారులు ఇళ్లకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన సింగిల్ (డీపీ) ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్ ఎత్తుకెళ్లారు. వారం రోజుల క్రితం దొడగట్ట గ్రామం వద్ద ట్రాన్స్ ఫార్మర్‌ను ఎత్తుకెళ్లారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

రేవుల్లో తవ్వుకో .. రాత్రంతా తోలుకో !

- 'దుర్గం'లో ఆగని ఇసుక అక్రమ రవాణా



పట్టణ సమీపాన పాతబైపాస్‌రోడ్డు పక్కన ఇటుకల బట్టీలో నిల్వచేసిన ఇసుక డంప్

రాయదుర్గం: ఇసుకను రేవుల్లో ఇసుక తవ్వేస్తూ, రాత్రంతా యథేచ్ఛగా తోలేస్తున్నారు. అధికారం మాది, అడిగేదెవరూ? అడ్డుకునేవారెవరూ? అన్నట్టు కొందరు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. రాయదుర్గం నియోజకవర్గం కర్నాటక సరిహద్దుకు ఆనుకొని ఉండడం, ఆ ప్రాంతంలో ఇక్కడి ఇసుకకు మంచి డిమాండ్ లభించడంతో ఇసుకాసురులకు కాసుల పంట పండుతోంది. రోజంతా వేదావతి హగరిలో తవ్వి ఓ చోట డంప్‌చేయడం, చీకటి పడగానే టిప్పర్లలోకి లోడ్‌చేసి కర్ణాటక సరిహద్దు దాటిస్తూ, కొందరు రూ.లక్షలు కూడగట్టుకుంటున్నారు. తాజాగా పట్టణ పరిధిలోని పాత బైపాస్ పక్కన కదిరిదేవరపల్లికి వెళ్లే రైల్వేట్రాక్‌కు ఆనుకొని ఓ ఇటుకల బట్టీలో ఇసుకను నిల్వ చేశారు. రెండు రోజుల క్రితం ఆరు టిప్పర్లలోకి లోడ్‌చేసి యథేచ్ఛగా తరలించారు. గురువారం మళ్లీ గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, వేపరాళ్ల, రంగచేడు, వేపులపర్తి క్రాస్ నుంచి ట్రాక్టర్లలో ఇసుక తీసుకొచ్చి కుప్పలో కలిపారు. ఈ తతంగం అందరి కళ్లుగప్పి గత కొద్దిరోజులుగా సాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా పట్టణ చుట్టు కొందరు డంప్‌లు పెట్టడం రాత్రికి తరలించడం చేస్తున్నారనే అభియోగాలు సర్వాత్రా వినిపిస్తున్నాయి. కొన్ని టిప్పర్లు పట్టణ నడిబొడ్డుమీదుగా దాటి బళ్లారి వైపు వెళ్లగా, మరికొన్ని బైపాస్ దాటుకుని గొల్లపల్లి దారిలో కొనసాగరం వైపు వెళ్తున్నట్టు తెలుస్తోంది. అలాగే గుమ్మఘట్ట మండలం కేపీకుంట వద్ద గత కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా జోరందుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ రోజు మార్చి రోజు టిప్పర్లు తరలిపోతున్నట్టు ప్రచారం సాగుతోంది. డి హీరేహాళ్ మండలం బాదనహాళ్ హగరిలో తవ్విన ఇసుక సమీప ఐరన్‌ఓర్ ఫ్యాక్టరీల మధ్య పొలాల్లో నిల్వచేసి రాత్రిళ్లు దర్జాగా తోలేస్తున్నారు. వీరి ఆగడాలను అడ్డుకోలేక, ఎదురించి ప్రశ్నించలేక స్థానికులు కూమిలి పోతున్నారు. ఇటీవల వరుసగా ఈ ప్రాంతాల్లో ఇసుక డంప్‌లు వెలుగు చూడటమే ఇందుకు నిదర్శనం. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సీజ్‌చేసి కొన్ని వాహనాలపై కేసులు నమోదుచేసినా అక్రమాలకు తెరపడడం లేదు. విలువైన ప్రకృతి సంపద తరగిపోకుండా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అక్రమార్కుల భరతం పట్టాలని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



బళ్లారి రోడ్డులో ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

అక్రమ రవాణాపై నిఘా

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తాం. ఇసుకను వ్యాపారంగా మార్చుకుంటే ఎంతటి వారైన సరే కఠిన చర్యలు చేపడతాం. ప్రజా అవసరాలకు మాత్రమే ఇసుకను ఉచితంగా వాడుకోవాలి. దాని ముసుగులో రాత్రిళ్లు తరలిస్తే కేసులు నమోదు చేయిస్తాం. అధికారులు దీనిపై నిఘా పెంచేలా ఆదేశాలిస్తాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఇసుక రవాణాకు అడ్డుకట్టేదీ?

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అడవి నుంచి రోజూ మండల కేంద్రమైన కుందుర్పి, తదితర గ్రామాలకు ట్రాక్టర్లలో పెద్ద ఎత్తున తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ట్రాక్టర్ యజమానులు అధికార పార్టీ నాయకులు కావడంతో రెవెన్యూ శాఖ, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునేవారు లేరని పరిసర గ్రామాల ప్రజలు చెప్తున్నారు. కొత్తపల్లి వాగు,కలిగొలిమి పరిసర ప్రాంతాలు, బెస్తరపల్లి దిగువ భాగాన వాగుల్లో ఇసుక తరలిస్తున్నట్లు రైతులు తెలిపారు. పైఅటవీ ప్రాంతానికి సిబ్బంది లేక పోవడంతో ఇసుక రవాణాకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని అడవిలోని ఇసుకను తీసుకెళ్లి కుందుర్పి, కొత్తపల్లి,మహంతపురం తదితర ప్రాంతాల్లో డంపు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.